ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# నెమలికన్ను చీరకథా సంపుటి - చేనేతల జీవన స్థితిగతులు

**దేవరపల్లి విశ్వనాథ్**

పరిశోధక విద్యార్థి,తెలుగు శాఖ,యోగి వేమన విశ్వవిద్యాలయం,కడప

Email:viswaviveka2@gmail.com

Article Received: 10/01/2026

Article Accepted: 15/02/2026

Published Online: 16/02/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3165

**సారాంశం:**

ఈ వ్యాసం భారతదేశ ప్రాచీన చేతివృత్తులలో ఒకటైన చేనేత వృత్తి యొక్క ఉజ్వల గతాన్ని మరియు దుర్భర వర్తమానాన్ని విశ్లేషిస్తుంది. సింధులోయ నాగరికత కాలం నుంచి మౌర్యులు, గుప్తుల యుగాల వరకు చేనేత కళకు ఉన్న ప్రాముఖ్యతను ఇది ప్రతిపాదిస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చేనేత వృత్తి కీలక పాత్ర పోషించిందని వివరిస్తుంది. కాలక్రమేణా కరెంట్ మగ్గాలు (పవర్‌లూమ్‌లు) రావడంతో చేతిమగ్గాల ఆధారిత జీవన విధానం సంక్షోభానికి లోనైనది. మార్కెట్‌లో మిల్లుబట్టలకు పెరిగిన ఆదరణ చేనేత కార్మికుల ఆదాయాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. నూలు ధరల పెరుగుదల, ప్రభుత్వ నిర్లక్ష్యం వంటి అంశాలు వారి పరిస్థితిని మరింత దయనీయంగా మార్చాయి. అనేక కుటుంబాలు వలసలకు గురై ఇతర వృత్తులవైపు మళ్లిన పరిస్థితిని ఇది చర్చిస్తుంది. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల భారంతో కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న దారుణ వాస్తవాన్ని వ్యాసం వెలుగులోనికి తీసుకొస్తుంది. శీనప్ప, సురేంద్ర వంటి పాత్రల ద్వారా చేనేత కార్మికుల జీవిత సంగ్రామాన్ని ప్రతిబింబిస్తుంది. చివరగా, చేనేత వృత్తి పరిరక్షణకు ప్రభుత్వ మద్దతు అత్యవసరమని ఈ వ్యాసం స్పష్టం చేస్తుంది.

**కీవర్డ్స్:**చేనేత వృత్తి, చేతిమగ్గాలు, కరెంట్ మగ్గాలు, వలస జీవితం, ప్రభుత్వ విధానాలు

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

భారతదేశం ఎన్నో వృత్తులకు పుట్టినిల్లు ప్రాచీన కాలంలో ఎంతోమంది చేతివృత్తులు చేపట్టి వారి జీవన విధానంలో పురోగతి సాధిస్తూ ఇతరులకు సహాయ సహకారాలు ఇస్తూ వచ్చారు భారతదేశం 5000 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన సంస్కృతికి ప్రతీకలు చేతి వృత్తులు. సింధులోయ నాగరికతలో మట్టితో తయారు చేసిన మట్టి పాత్రలు, ఆభరణాలు, ముద్రల తయారీకి సంబంధించినటువంటి ఆధారాలు ఎన్నో లభించాయి. చారిత్రకంగా చూసినట్లయితే మౌర్యులు గుప్తులు వారి కాలంలో కూడా చేతి వృత్తులు పురోభివృద్ధి సాధించాయి. తర్వాత కాలంలో వస్త్ర కళలు నగర తయారీ వంటి పనులు విస్తరించాయి. ఆ విధంగా ప్రాచీన కాలంలో చేతివృత్తుల వలన గ్రామీణ ప్రాంతాలు ఒకరిపై ఒకరు ఆధారపడి చేతి వృత్తులతో స్వర్ణధామంగా భారతదేశంలోని గ్రామాలు విలసిల్లాయి. అటువంటి ప్రాచీనవృత్తుల్లో చేనేత వృత్తి ఒకటి ఈ వృత్తిని నమ్ముకొన్న వారు ప్రాచీన కాలంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వారి జీవనం ఉండేది కానీ రాను రాను ఈ వృత్తిని నమ్ముకొన్న వాళ్ల పరిస్థితి ఈ రోజుల్లో ఏ విధంగా పరిణమితుందో తెలపడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

నేత అన్నది వస్త్ర ఉత్పత్తి పద్ధతి దీనిలో రెండు విభిన్నమైన నూలు లేదా దారాలను లంబకోణాలలో ఒకదానితో ఒకటి కలిపి ఏర్పరుస్తారు నేత అన్నది ప్రసిద్ధి చెందిన ఒక కుటీర పరిశ్రమ పద్మశాలి, దేవాంగ, తోగట, తోగటవీర మొదలైన వారు ఈ వృత్తిని చేపట్టి ఉన్నారు చేనేత కేవలం భౌతిక వృత్తే కాకుండా కళాత్మకంగా నైపుణ్యంతో కూడిన పని కావడంతో దీని నేర్చుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉంటుంది చేనేత కుటుంబ సభ్యులు ఎక్కువగా ఈ కళను నేర్చుకుంటారు.చేనేత కార్మికుల హవా చాలా కాలం నడిచింది. వారి శ్రమకు తగ్గట్టు ఆదాయం వస్తుంది. దాంతో ఇంటిల్లిపాది దానిపైనే ఆధారపడేవారు. అటు తరువాత కరెంటు మగ్గాలు రావడంతో నేతమగ్గాల నుంచి తయారయ్యే బట్టలకు ఆదరణ తగ్గుతూ వచ్చింది. అది అలా కొనసాగి నేటికి పూట గడవడం కూడా కష్టమనే దశకు చేరుకున్నది.

"శీనప్ప బాధగా నిట్టూర్చాడు. తన తండ్రి ఉన్నప్పుడు ఇరవై మగ్గాల్లో చీరలు నేయించి, వెంకటగిరి, ధర్మవరం వంటి ఊర్లకు ఆ చీరలు పంపి వ్యాపారం చేసేవారు. ఆ రోజుల్లో చేనేత వృత్తి ఒక వెలుగు వెలిగింది. చేనేత కార్మికులకు పనికి తగ్గట్లుగా మంచి వేతనాలు లభించేవి. శీనప్ప తండ్రికి తన వ్యాపారంలో మంచి లాభాలొచ్చేవి. డబ్బు కూడబెట్టి ఆయన రాగులపాడులో ఎనిమిది సెంట్ల స్థలంలో ఒక పెద్ద పెంకుటిల్లు కట్టాడు. ఆ ఇంటిలో శీనూ, అతని తమ్ముళ్లూ, చెల్లెళ్లూ, గారాబంగానే పెరిగారు. తన తరువాత అనువంశిక వృత్తి ఐన చేనేత పనిలో కొడుకు కొనసాగాలన్న ఉద్దేశంతో శీనప్పను చేనేత వృత్తిలోకి దించాడు అతని తండ్రి వెంకటేసు."
(నెమలికన్ను చీర పులిమేక ఆట - పుట 16 - రాచపూటి రమేష్)

ఆ తర్వాత తండ్రి చనిపోయాక, శీనప్ప తన మగ్గాల పెడ్లో పదిమంది చేనేత కార్మికులతో లుంగీలు, చీరలూ నేయిస్తూ, తన వ్యాపారం కొనసాగించాడు. ఆ ఊరిలో రద్దీగా ఉండే గాంధీ రోడ్డులో ఒక దుకాణం అద్దెకు తీసుకొని ఆ బట్టలను అమ్మేవాడు. పదేళ్లపాటు అతని వ్యాపారం సజావుగా సాగింది. శీనప్పకొట్లో నాణ్యమైన చీరలు, పంచెలు, లుంగీలు లభించడంతోబాటు, ధరలు కూడా కాస్తా తక్కువగా ఉండడంతో ఆ ఊరి ప్రజలే కాక, బయటి ఊర్లవాళ్లు కూడా అక్కడ బట్టలు కొనేవారు. కానీ కాలక్రమంలో ఆ ప్రాంతంలో కరెంటుతో నడిచే మరమగ్గాలు అనేకం పుట్టుకొచ్చాయి. చేతిమగ్గంలో కష్టం మీద రోజుకొక చీర తయారైతే, కరెంటు మగ్గంలో రోజుకు నాలుగైదు చీరలు తయారయ్యేవి. దాని కవసరమైన పనివాళ్లు కూడా తక్కువ. కరెంటు మగ్గంలో తయారయ్యే చీరలు, లుంగీలు పెద్ద నాన్యంగా లేకపోయినా, వాటి ధరలు తక్కువ ఉండడంతో ప్రజలు క్రమంగా పవర్లూంలో తయారైన వస్త్రాలు కొనడానికే మొగ్గు చూపించేవారు. దాంతో శీనప్ప వ్యాపారం దెబ్బతింటూ వచ్చింది.కరెంట్ మగ్గాల యజమానులు ధనవంతులు మరియు పలుకుబడి కలిగిన వారగుట వలన, వారి వల్ల ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను తేలికగా తీసుకుంటారు. రాజకీయ నాయకులుగానీ, అధికారులుగానీ వారికే వత్తాసు పలుకుతున్నారు.

"కరెంట్ మగ్గాల హోరు శబ్దాలకు పిల్లలు చదువుకోలేకపోతున్నారని, రాత్రులు నిద్ర పట్టడం లేదని చాలామంది ప్రజలు ఫిర్యాదు చేయడంతో యూనిట్లను ఊరికి దూరంగా తరలించమని కొందరు ఉద్యమాలు నడిపారు. కానీ కరెంటు మగ్గాల యజమానులు లాభసాటి వ్యాపారం చేసుకుంటూ నాయకులకు భారీగా నజరాణాలు సమర్పించుకునేవారు. కాబట్టి వాటి మనుగడకు ఢోకా లేకుండా పోయింది." (నెమలి కన్ను చీర - పులి మేక ఆట, పుట 19- రాచపూటి రమేష్).

కొండచిలువ మేక పిల్లను కబళించినట్లు, సింహం కుందేలును బలిగొన్నట్లు క్రమంగా కరెంటు మగ్గాల వల్ల చేతిమగ్గాల మనుగడపై ప్రమాదం ఏర్పడ సాగింది. ఒకప్పుడు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేకంగా చెప్పుకునే గద్వాల జరీచీర, ధర్మవరం పట్టుచీర, వెంకటగిరి బుటాచీర కనుమరుగయ్యే ప్రమాదం వచ్చింది. దీని మూలంగా ఈ జాతీయ జెండా నేసినవాళ్లకు జాతి మంగళం పాడుతోందనవచ్చు. అనాదిగా అతివలందరికీ వస్త్రాలు నేసి ఇచ్చిన వాడికి ఆదరణ కరువవుతున్నది. పులి మేకను ఒకే బరిలో వదిలితే పులి మేకను తిన్నట్లుగా, కరెంటు మగ్గాలు చేతి మగ్గాలను చంపుతున్నాయనవచ్చు. దానితో శీనప్ప అనే చేనేత కార్మికుడిని తీవ్రమైన నిస్పృహ ఆవరించింది. అతనికి కరెంటు మగ్గాలు ఏర్పాటు చేసి నిషేధించబడిన వస్త్రాలు నేయించి, చట్టాలను ఉల్లంఘించడం ఇష్టం లేదు. కానీ తీవ్ర నష్టాల్లో వ్యాపారం కొనసాగించలేని స్థితిలోకి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

చేరుకుంటాడు. ఇల్లు అమ్ముకోవలసిన అగత్యం ఏర్పడుతోంది. దుకాణంలోని సరుకులు ఏదో ఒక ధరకు అమ్మేసి, మగ్గాలను విక్రయించి, మగ్గాల షెడ్డును ఎవరికో ఒకరికి అప్పగించి, ఏ బియ్యం వ్యాపారం చేసుకుంటూ బతకాలని నిశ్చయించుకుంటాడు శీనప్ప. అందుకే తానిక ఎవరికీ పని కల్పించలేనని మగ్గాల షెడ్డులో పనిచేసే చేనేత కార్మికులకు చెప్పేశాడు. దానితో అతని నమ్ముకొని ఉన్న కార్మికులు వీధిపాలయ్యారు.

వివిధ కారణాలతో చేనేత వస్త్రాలు అమ్ముడు పోవడంలేదు. మిల్లుబట్టలు భారీగా అమ్ముడుపోతున్నాయి. దాంతో నేత కార్మికుల పిల్లలు సమీపంలోని పట్టణాలకు వలసవెళ్ళి హోటళ్ళలో పనిచేస్తూనో, ఆటోలు నడుపుతూనో కాలం గడుపుతుంటారు.

"ప్రజల్లో ఎక్కువ మంది మిల్లుల నుండి తయారయ్యే గుడ్డలను కొంటూ తాము తయారు చేసే చీరలు, పంచెలు, ధోతీల్లాంటి వాటిపై తిరస్కారభావం చూపుతూ వున్నారు. ప్రభుత్వమూ భారీగా చిలప నూలును ఎగుమతి చేస్తూ నూలు, రేషం (సిల్కు నూలు) ధరలను ఇబ్బడి ముబ్బడిగా పెరిగేలా చేస్తోంది. నూలురేట్లు పెరిగినట్లు చేనేతకార్మికులకు మజూరీలు, చీరల ధరలు పెరగడం లేదు. ఫలితంగా చేనేత మగ్గంపై ఆధారపడి జీవించే కార్మికుల పరిస్థితి దుర్భరంగా తయారైంది.

నేతకారులు చాలామంది దగ్గర్లో వున్న పట్టణాలకు వలసపోయి చిన్న హోటళ్ళలో పని చేస్తూనో, ఆటోలు తోలుకొంటూనో కాలం గడుపుతూ వున్నారు. చదువుకున్న యువకులు ఉద్యోగాలు దొరక్కపోయినా, అనువంశిక చేనేతలోకి రావడం లేదు.అందరి మొఖాల్లో నైరాశ్యం. దిగులు గూడు కట్టుకొని వున్నాయి." (నెమలికన్ను చీర - ముసురు - రాచపూటి రమేష్ - పుట 31)

విధిలేని పరిస్థితుల్లో నేత కార్మికుల పిల్లలు ఆటో తోలుకుంటూనో, హోటళ్ళలో పనిచేస్తూనో జీవితాన్ని నెట్టుకు వస్తుంటారు.

చేనేత మగ్గాలపై ఉత్పత్తి అయిన వస్త్రాలను వినియోగదారులు కొనుగోలు చేయడం లేదు.దానికి తోడు దారం, చరఖా ఇతరముడి సరుకుల ధరలను ప్రభుత్వం భారీగా పెంచింది. ఈ వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు.

ఈ నేపథ్యంలో చూసినపుడు ఇతర వర్గాలకు రాయితీలిస్తున్న విధంగా ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇవ్వడం లేదని సామాజిక విశ్లేషకులు అంటున్నారు. ప్రభుత్వమే అలా చేయడంవల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లో చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. భారతదేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారిలో అగ్రభాగాన రైతులుండగా,రెండవస్థానంలో చేనేత కార్మికులున్నారు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

స్వాతంత్ర్యానంతరం నుంచి నేటి వరకు దాదాపుగా ఇరవైఐదువేల మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని వివిధ సర్వేలు ప్రకటిస్తున్నాయి. అందులోని వాస్తవ అవాస్తవాల సంగతి ఎలా ఉన్నా చేనేతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నది మాత్రం సత్యం.

మదనపల్లె మపట్టణంలో మగ్గంనేసి బాగా డబ్బు సంపాదించి కుటుంబాన్ని పోషించుకోవాలని తలచిన సురేంద్ర అనే నేతకార్మికుని కుటుంబం అనేక ఇబ్బందులకు గురౌతుంది. పల్లెలో తల్లిదండ్రులు అనారోగ్యం పాలవుతారు. ఇక్కడ సురేంద్ర ఆరోగ్యం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో రెడ్డెప్ప అనే వ్యక్తి సూచనలు, సలహాలు, సహకారం మూలంగా తిరిగిపల్లెకు వెళతాడు.

"మీ అమ్మకి మళ్లీ ఆస్తమా తిరగబెట్టింది. మీ నాయన కూడ గసతోనే మంచం పట్టినాడు. పోయినతూరి మీ నాయన జోతులప్పుడు తొలిపూజ చేసినాడు. ఈసారి కడపమాను మోసి తొలిపూజ సేయలేడు. మంచంమీద మడిసి ఏం పూజ సేస్తాడు? నువ్వు మళ్లీ వూరు రావలసిందే" అన్నాడు. రామయ్య మామ. మదనపల్లెలో వున్న కూతురు ఇంటికి చుట్టపుచూపుగా వచ్చి, సురేంద్రను చూడ్డానికి వచ్చాడాయన.

సురేంద్ర ఏమీ మాట్లాడలేదు. సరోజ కూడా మౌనం వహించింది. రామయ్య మామ గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తే సురేంద్ర లివర్ పాడై మంచం పట్టిన విషయం చెప్పింది సరోజు" (నెమలికన్ను చీర -వలస పక్షులు - పుట 54 - రాచపూటి రమేష్)

ఆ తరువాత సొంతూళ్లో కులంపని చేసుకోకుండా టౌనులో బాగా బతికేయచ్చని వలసలు పోతే ఇట్టనే జరగతాది. నేను మళ్లీ ఒక పెళ్లికి రెండు మూడురోజుల్లో రావాల. మీ నాయనతో మట్లాడి విషయం చెప్తాను" అంటాడు రామయ్య మామ ముక్తసరిగా.

దాంతో ఆ దంపతులిద్దరికీ ఏం చేయాలో తోచడం లేదు. ఒల్లు పాడై సురేంద్ర కఠినమైన జకార్డు మగ్గంనేత నేయలేకుండావుంటాడు. వూరికి తిరిగి వెళ్లాలంటే షావుకారు అప్పు, మిగిలిన బాకీలు తీర్చాలి. మందులకు, డాక్టర్లకు విపరీతంగా ఖర్చు ఔతూ ఉంటుంది. ఎట్ల లేదన్నా లక్షా లక్షన్నర చేతిలో పడితేగాని గట్టెక్కలేని గడ్డు పరిస్థితి..అన్నట్టుగానే రామయ్య మామ మూడురోజుల్లో మళ్లీ వాళ్లింటికి వస్తాడు. సరోజ ఆయనకు కాఫీ ఇచ్చి మర్యాద చేస్తుంది. ఆ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుకుంటారు.

అపుడు రామయ్య, మీ నాయనతో మాట్లాడినా, మీ అమ్మకి పసుపు కుంకాల కింద వాళ్ల పెళ్లప్పుడు రెండెకరాలు మీ తాత ఇచ్చినాడంట. ఆ భూమిని మీ మామ సాగు చేస్తావున్నేడిన్ని దినాలు, మీ వోళ్లకు దాంట్లోంచి ఏమీ ఇచ్చిందిలే, ఇప్పుడు మీ మామ పిలకాయలు బాగా సదువుకోని మంచి పొజిషన్ల

వున్నారంట. ఆ భూమితో వాళ్లకు పస్లే. ఆ మడి అమ్మేసి మీ అప్పులు తీరుస్తామని చెప్పినాడు మీ నాయన అంటూ అప్పులు తీర్చే మార్గం చెబుతాడు.రెడ్డెప్ప కూడా డెబ్బైవేలు సర్దుతాడు. దాంతో సురేంద్ర చేసిన అప్పు తీరుతుంది. ఆస్తిపోతుంది.

రెడ్డెప్పలాంటి పరోపకార పరాయణులు ఉంటే కష్టాల్లో ఉన్నవారెందరో బయట పడతారు. ఇలా అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన రెడ్డెప్ప లాంటి వాళ్ళను సురేంద్ర వంటి వాళు ఏ నిత్యం స్మరించుకోవాలి. లేదంటే కృతఘ్నులవుతారు. చేసిన మేలు మరచిన వారవుతారు.

పైన తెలిపిన విధంగా ప్రాచీన కాలంలో ఈ వృత్తిని నమ్ముకున్న వారి జీవితం సాఫీగా జరిగిపోయింది కానీ ఈ మధ్యకాలంలో ఈ వృత్తిని నమ్ముకున్న నేతనుల పరిస్థితి చాలా దారుణంగా మారిపోయింది.ఈ వృత్తిని చేపట్టి అందులో తగినంత లాభాలు లేక ఈ వృత్తిని విడిచిపెట్టలేక వేరే వృత్తి లోకి వెళ్లి స్థిరపడలేక చేనేతల పరిస్థితి తేనెలోపడ్డ ఈగలాగా తయారైంది.ఇప్పటికీ కొంతమంది వారి కులవృత్తిపై మమకారంతో ఈ వృత్తిని నమ్ముకొని దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని చెప్పవచ్చు ప్రభుత్వం ఇంకొంత ముందడుగు వేసి నేతన్నల సమస్యలు పరిష్కరించకపోతే ఎప్పటినుంచో భారతీయ సంస్కృతి కళలకు నిలయమైన చేనేతల వృత్తి కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు:**

నెమలికన్ను చీర కథా సంపుటి - రాచపూటి రమేష్

చేనేత దర్పణం - పుత్సల సత్యనారాయణ

చేనేత మొగ్గలు (కవితా సంపుటి) డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్

కథా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య